క్లుప్తంగా

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్
రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



ఆటోనగర్(విజయవాడతూర్పు): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 16వ డివిజన్‌లోని చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ తపాలా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, జాతీయ కమిషన్ సభ్యులు (ఎస్సీ) డాక్టర్ అంజు బాల మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహా వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ మార్గంలో నడుస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ తూర్పునియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఒక దిక్సూచి లాగా పని చేస్తుందన్నారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ కార్యదర్శి దాసరి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పండరి సాయి మందిర వార్షికోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట గణపతిరావురోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పండరి సాయి మందిరం పంచమ వార్షికోత్సవ కార్యక్రమాలు ఈ నెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు మందిరం ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఏడో తేదీన గణపతిపూజ, వరాహిమాత హోమం, మారేడు దళార్చన తదితర కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. ఎనిమిదో తేదీన పంచామృతాభిషేకం, సుదర్శన హోమం, తులసీ దళార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. తొమ్మిదో తేదీన పంచామృతాభిషేకం, సూర్యహోమం, గులాబీ అర్చన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలుంటాయని వివరించారు. అదేవిధంగా చివరి రోజు మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. మూడు రోజులూ ఉదయం కాకడహారతి, నిత్యాభిషేకం, పూజా, పుణ్యాహవచనం, మహానైవేద్యం, సంధ్య హారతి, దశహారతులు నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి గురువారం శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 33వ డివిజన్ సత్యనారాయణపురంలో అభివృద్ధి పనులు దిగ్విజయంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. గురువారం వైఎఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆయన తిరుమలరాజువీధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 14వ ఆర్థిక సంఘం నిధులతో నూతన రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిష్టా రామలింగమూర్తి, ఉప్పు రంగబాబు, చాంద్‌శర్మ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సాంబశివరావు

కంకిపాడు(పెనమలూరు): వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని గొడవర్రు జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు తోట సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నియామకం చేపట్టారు. గురువారం తోట సాంబశివరావు కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తాజా కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించటం సంతోషంగా ఉందన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జాలిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా పాలన

- విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ ఆశయాలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా నడిచే ప్రభుత్వం తమదన్నారు. ప్రతి పేదవాడికి తోడుగా ఉండే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పరిపాలన చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పార్టీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, ఇర్ఫాన్, కోటిరెడ్డి, ఆంజనేయరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్, నాయకులు మైలవరపు దుర్గారావు, గోదావరి బాబు, కొండపల్లి బుజ్జి, కొనకళ్ల విద్యాధరరావు, బుదాల శ్రీనివాసరావు, తాండ్ర ఇంద్ర, కామళ్ల జోజి, సంగీత్ బాబు, యర్రజోన్న విజయలక్ష్మి, గౌడపేరు సుదీర్, జార్జి పాల్గొన్నారు.

కేఎల్‌రావు నగర్‌లో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కేఎల్‌రావునగర్ పార్కు రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద గురువారం ఘన నివాళులర్పించారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఖాదర్‌సెంటర్‌లో..

వించిపేట(విజయవాడపశ్చిమ): మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పైడిముక్కల చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం వించిపేట, ఖాదర్‌సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల పాండు, దాడి జగన్, పైడాడ శ్రీనివాసరావు, ఏనుగుల రమేశ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని కొనసాగిస్తున్న జగన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని వించిపేటలోని ఆసిఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ఇతర నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజిద్‌ఖాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ మహ్మద్, అలీ, రెహమాన్, షఫీ, ఫిరోజ్ ఖాన్, మసూద్, గౌస్, జిలాని, హై, యూసబ్ తదితరులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో..

కొత్తపేటలోని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ కార్యాలయంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 51, 53 డివిజన్ల కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీరావులు అతిథులుగా పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తమ్మిన హరిబాబు, జె. భానుప్రతాప్ పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కర్నాటి రాంబాబు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాదిగ సంక్షేమ సంఘం నేతలు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్ ఇతర నాయకులు

ఇళ్ల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి

అధికారులకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశం

పటమట(విజయవాడతూర్పు): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కొత్త భవనంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మొత్తం 7,210 ఇళ్లకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నామన్నారు. అందులో వాంబేకాలనీ 3,373, న్యూరాజరాజేశ్వరీ పేట 2,939, పాయకపురం, ఊర్మిళనగర్, కె.ఎల్.రావునగర్ 898 ఇళ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్లకు చెల్లించాల్సిన ఫీజుల వసూళ్లకు కౌంటర్లను కూడా ఏర్పాటు చేశామని, తక్కువ కాలవ్యవధిలో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమములో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లత, మేనేజర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బహిరంగ ప్రదేశాల్లో గుంపులు గుంపులుగా చేరి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజా సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, నైజాంగేటు ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ఆకతాయిలు గుంపులు గుంపులుగా చేరినా, మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫుట్ పెట్రోలింగ్‌లో క్యూఆర్‌టీఎస్, ఎస్‌ఈబీ, టాస్క్ ఫోర్స్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలో..

సత్యనారాయణపురం: నగరంలో శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా ఎస్‌ఎన్‌పురం పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ దుర్గా మహేష్ సిబ్బందితో కలసి రైల్వే స్టేషన్, కరుణా హోటల్ సెంటర్, పెజ్జోనిపేట, బొగ్గులైన్ క్వార్టర్స్, ఫ్రూట్ మార్కెట్ తదితర ప్రాంతాలలో పోలీసులు పర్యటించి మహిళల భద్రత, దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు అనుమానితులను విచారణ చేసి వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అదే విధంగా పలు వాహనాల రికార్డులను పరిశీలించారు.

జగనన్న ప్రభుత్వంలోనే మైనార్టీలకు భద్రత

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లిం మైనార్టీలకు భద్రత ఉందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం 'హర్ దిల్ మే వైఎస్సార్'లో భాగంగా గురువారం మైలవరం నియోజకవర్గం పరిధిలోని వెస్ట్ ఇబ్రహింపట్నంలోగల మజీదే ఇబ్రహీం వద్ద స్థానిక ముస్లిం మైనార్టీ పెద్దలు, మసీదు బాధ్యులతో ఆయన సమావేశమయ్యారు. తొలుత మసీదులో అసర్ నమాజును ఆచరించారు. ఈ సందర్భంగా మసీదులోని ఇమామ్, మౌజాన్‌ల జీతాలు, ఇతర సమస్యలను ఆయన నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ బాహెద్, మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, ఎండీ ఇక్బాల్‌తోపాటు మసీదు ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, సెక్రటరీ షేక్ దావూద్, ట్రెజరర్ షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, షేక్ గాలిబ్ షహీద్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గౌస్ మొహిద్దీన్

టీకాతోనే వ్యాధుల నివారణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లుల నుంచి రేబిస్, లెప్టోస్పైరోసిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు మనుష్యలకు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని నివారించేందుకు టీకాలు వేయించడమే సరైన మార్గమని పశుసంవర్థక శాఖ విజయవాడ డివిజన్ ఉపసంచాలకుడు డాక్టర్ గోపీచంద్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భవానీపురం ఐరన్‌యార్డ్‌లోని జీవకారుణ్య ఆశ్రమంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, పశుసంవర్థక సహాయ సంచాలకుడు డాక్టర్ సాయిగోపాల్, డాక్టర్ సుజని, జీవకారుణ్య సంస్థ చైర్మన్ మురాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జూనోటిక్ వ్యాధులపట్ల అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు.

జియో ఫోన్‌కు పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రిలయన్స్ జియో నూతనంగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన కొత్త మోడల్ సెల్‌ఫోన్‌కు గురువారం దుర్గగుడిలో పూజలు నిర్వహించారు. రిలయన్స్ జియో విజయవాడ ప్రతినిధులు రవీంద్రనాథ్‌రెడ్డి, మహేష్, సదాబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నూతన మొబైల్‌ను ఆలయ ఈవో భ్రమరాంబ ఆవిష్కరించారు. అనంతరం ఈవో చేతుల మీదగా ఆలయ ఉద్యోగికి ఆ ఫోన్‌ను బహూకరించారు.

కరకట్ట వాసుల కల సాకారం దిశగా..

- ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్‌కు కృషి
- పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని 38, 40, 41 డివిజన్ల పరిధిలోగల కృష్ణానది కరకట్ట ప్రాంతంలో నివసించే పేదల ఇళ్ల పట్టాలను నిబంధనలకు లోబడి రెగ్యులరైజేషన్ చేసేందుకు కృషి చేస్తామని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కరకట్ట వెంట కొన్ని దశాబ్దాలుగా నివసిస్తున్న వారి ఇళ్ల పట్టాలను రెగ్యులరైజ్ చేసేందుకు గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. స్థానిక 38వ డివిజన్ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి కరకట్ట వెంబడి 40, 41 డివిజన్ల పరిధి వరకు ఈ ఫీల్డ్ విజిట్ సాగింది. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఈ కరకట్ట ప్రాంతం పరిధిలోని మూడు డివిజన్లలో కలిపి మొత్తం 1100 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. అయితే వారందరూ ఇళ్ల పట్టాలు కలిగి ఉన్నప్పటికీ వాటి రెగ్యులరైజేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్ అనేది వారికి ఒక కలలా మిగిలిపోయిందని, దానిని సాకారం చేసేందుకే ఈ రోజు క్షేత్రస్థాయి పర్యటన చేశామన్నారు.

నిబంధనలకు లోబడే..

జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో కరకట్ట ప్రాంతంలో ఫీల్డ్ విజిట్ చేశామని, ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. అయితే నిబంధనలకు లోబడే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, యర్రఘ ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, స్థానిక నాయకులు బొమ్ము మధు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుమ్మరిపాలెం సెంటర్‌లో ఇంటి పట్టాను పరిశీలిస్తున్న వెలంపల్లి, చిత్రంలో కార్పొరేటర్లు

ఆషాఢం.. వైభవం

సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. విజయవాడకు చెందిన వాసవి షైన్ విజయం వారి ఆధ్వర్యంలో అర్జున వీధి నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. అర్జున వీధి నుంచి ప్రారంభమైన ఊరేగింపులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద సారెను సమర్పించారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, వాసవి షైన్ విజయం అధ్యక్షులు సాదు దుర్గాదేవి, సాదు సత్యనారాయణ, పాల్గొన్నారు.


రికార్డు స్థాయిలో తరలివస్తున్న భక్త బృందాలు

అమ్మవారికి సారెను సమర్పించేందుకు విజయవాడ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త జనంతో మహా మండపం ఆరో అంతస్తు కిటకిటలాడింది. అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. విజయవాడకు చెందిన గుండపు నిర్మలకు చెందిన 150 మంది భక్తులు, సింగ్‌నగర్‌కు చెందిన శాంభవికి చెందిన 108 మంది భక్తులు, శ్రీ సద్గురు రాఘవేంద్ర మహిళా సమాఖ్యకి చెందిన 60 మంది భక్తులతో పాటు మొత్తం 1,500 మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు.



భక్తబృందంతో ఇంద్రకీలాద్రికి విచ్చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ రాంబాబు

అభాగ్యుడికి అండగా..



రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న వెలంపల్లి, చిత్రంలో గోదావరి బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఓ ఒంటరి యువకుడి దయనీయ స్థితి చూసిన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చలించిపోయారు. విజయనగరం జిల్లాలో జన్మించి చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలో కొండ ప్రాంతంలో నివసిస్తున్న గూడేల రమేష్ (32)కు తల్లి లేదు. తండ్రి రెండో పెళ్లి చేసుకుని విజయనగరం వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ స్థానికంగా మార్బుల్, టైల్స్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మార్బుల్ రాళ్లు ప్రమాదవశాత్తు కాళ్లమీదపడటంతో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ఒక కాలు మోకాలి వరకు తీసేసి రెండో కాలికి ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ సర్జరీ చేసిన కాలికి ఇన్‌ఫెక్షన్ రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ భర్త గోదావరి బాబును ఆశ్రయించాడు. దీంతో ఆయన గురువారం రమేష్‌ను భవానీపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయానికి తీసుకువచ్చి ఎమ్మెల్యే వెలంపల్లికి అతని దైన్య స్థితిని వివరించారు. తక్షణమే స్పందించిన వెలంపల్లి వైద్యులతో మాట్లాడి ఆస్పత్రికి పంపించారు.

వేడుకగా మంగళంపల్లి జయంతి

విజయవాడ కల్చరల్: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత సేవలు వెలకట్టలేనివని విశ్వమాతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. శ్రీ రామసరసి శ్రీ రామతత్వ ప్రచార సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం సంగీత విద్వాంసుడు ప్రమోక్ష డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 93వ జయంతి వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకను సంగీత ప్రతిభద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడు మంగళంపల్లి అని అభివర్ణించారు. ఆయన సంగీత ప్రయాణం నగరంలోనే ప్రారంభమైందన్నారు. సంగీత విద్వాంసుడు కస్తూరి గోపాలరావు, రామకోటి ధర్మాధికారి శిష్ట్యాల హనుమత్‌ప్రసాద్, రామ సరసి సేవా సంస్థ బాధ్యులు డాక్టర్ సీఎల్‌వీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంగీత కళాశాల ఆధ్వర్యంలో..

దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో బాలమురళీ కృష్ణ 93 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి జ్యోతిని వెలిగించి జయంతి వేడకలను ప్రారంభించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ చేనేత పద్మశాలి క్యాంపింగ్ కార్యక్రమం గురువారం 48వ డివిజన్‌లోని 154వ సచివాలయం పరిధిలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రీజనల్ కోఆర్డినేటర్ వానపల్లి త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పశ్చిమ నియోజక వర్గ బీసీ కులాల పర్యవేక్షకులు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, 52వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తంగేళ్ల రామచంద్రరావు(రాము), 48వ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షులు పిళ్లా సూరిబాబులతో కలిసి సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ వర్గాల ప్రజల కోసం నాలుగేళ్లలో ఖర్చు చేసిన మొత్తం వివరాలను తెలియజేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోళ్ల రజనీ, ఐతా కృష్ణ కిశోర్, ఇలిపిల్లి వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా చట్టాలను అతిక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక పోలీసుస్టేషన్ సీఐ అబ్దుల్ సలామ్ అన్నారు. భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీఐ అబ్దుల్ సలామ్ నేతృత్వంలో సిబ్బంది గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. స్థానిక చెరువు సెంటర్ రామరాజ్య నగర్ ప్రాంతాల్లో విస్తృత సోదాలు చేపట్టారు. అలాగే రామరాజ్యనగర్ కొండ ప్రాంతాల్లో అసాంఘిక శక్తులపైనా, నిషేధిక పొగాకు ఉత్పత్తుల విక్రయాలపైనా నిఘా ఉంచామన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి అసాంఘిక కార్యక్రమాలు గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసు వారికి సమాచారం తెలియపరచవలసిందిగా ప్రజలను కోరారు. అలాగే కబేళా ఇండస్ట్రియల్ ఏరియాలో వ్యాపారస్తులతో మాట్లాడి త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం గణపతి స్వామికి అభిషేకాలు, విశేష పూజ , గణపతి హోమాన్ని నిర్వహించారు. ఇంద్రకీలాద్రికిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం గణపతి హోమం నిర్వహించారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో యజ్ఞనారాయణ శర్మ, ఇతర ఆలయ అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కర్మేల్ చర్చి ప్రాంతంలోని పురుషోత్తం వీధికి చెందిన పైడిపాటి ప్రవల్లిక, దుర్గాప్రసాద్‌లు భార్యభర్తలు. వీరికి 2015లో ప్రేమ వివాహం పెద్దల సమక్షంలోనే జరిగింది. వివాహ సమయంలో రూ. 2 లక్షల కట్నం, ఇతర ఖర్చుల కింద మరో రూ. నాలుగు లక్షలు ఇచ్చారు. గత కొంత కాలంగా భర్త మద్యానికి బానిస కావడంతో పాటు పనికి వెళ్లకుండా ప్రవల్లికను వేధింపులకు గురి చేయసాగాడు. దీనికి తోడు అత్త లక్ష్మీ, మామ దుర్గారావులు పుట్టింటికి వెళ్లి అదనంగా కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతకు జైలు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్ మల్లిఖార్జునపేటకు చెందిన 23 ఏళ్ల తాడిశెట్టి వెంకటరమణ గంజాయి విక్రయిస్తున్నాడనే సమచారంలో గత ఏడాది నవంబర్ 20వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిశోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.